


మున్సిపల్ కార్మికుల శ్రమ దోపిడీ




అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు..



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

25-3-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## కామారెడ్డి ఆర్డీవోగా ఎన్‌వై గిరి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ఆర్డీవోగా ఎన్‌వై గిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2025 మార్చి 12 న బాధ్యతలు స్వీకరించి ఏడాది పాటు ఆర్డీవోగా విధులు నిర్వర్తించిన వీణ బదిలీ అయ్యారు. ఎండోమెంట్ శాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఆమెను ప్రభుత్వం డిప్యుటేషన్‌పై నియమించింది.

## మార్కెట్‌యార్డులో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మార్కెట్ యార్డులో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తామని సీపీ సాయి చైతన్య అన్నారు. నగరంలోని మార్కెట్ యార్డును ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పసుపు విక్రయదారులతో సమావేశమయ్యారు. మార్కెట్ యార్డులో ఎలాంటి గొడవలు, వివాదాలు లేకుండా వ్యాపారం జరగాలని సీపీ సూచించారు. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. తప్పుడు తూకాలు మధ్యవర్తుల మోసాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యార్డు సిబ్బందికి సూచించారు. మార్కెట్ చుట్టూ ట్రాఫిక్ సమస్య తగ్గించే విధంగా సహకరించాలని కోరారు. ఆయన వెంట మూడవ టౌన్ ఎస్సై శ్రీహరి బాబు, పసుపు రైతులు తదితరులున్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా గైక్వాడ్ హన్మంత్




**అక్షరటుడే, కోటగిరి :** కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా గైక్వాడ్ హన్మంత్ నియమితులయ్యారు. ఈ మేరకు నిజామాబాద్ కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి నియామక పత్రాన్ని గైక్వాడ్ హన్మంత్‌కు అందజేశారు. కోటగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్ మాట్లాడుతూ.. తనను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా అవకాశం ఇచ్చిందన్నారు. బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. పార్టీకి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, పోచారం భాస్కర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బొప్పపూర్ పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్



**అక్షరటుడే, బాన్సువాడ:** రుద్రూర్ మండలం బొప్పపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల గైర్హాజరు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా 3వ, 6వ తరగతి విద్యార్థుల పరీక్ష పత్రాలను పరిశీలించారు. విద్యార్థులు చదవడం రాయడం నైపుణ్యాలను కూడా పరిశీలించి, ఈ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు.

## మొదటి మీటింగ్ జరిగేనా?

కామారెడ్డి పట్టణంలో అనేక సమస్యలు నెలకొన్నాయి. కొత్తగా కొలువుదీరిన పాలకవర్గం తమ సమస్యలు పరిష్కరిస్తుందని ప్రజలు ఆశించారు. వారి ఆశలు అడియాసలు అయ్యాయి. కొత్త ఛైర్‌పర్సన్ బాధ్యతలు స్వీకరించి నెల రోజులు దాటినా.. ఇప్పటివరకు పాలకవర్గ సమావేశం నిర్వహించలేదు. ప్రజా సమస్యలపై చర్చించలేదు. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి




- కామారెడ్డిలో సమస్యల తిష్ట
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని బల్దియా పాలకవర్గం

కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గం గత నెల 16న ప్రమాణస్వీకారం చేసింది. 24న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గం కొలువుదీరి నెలరోజులు దాటింది. ఇప్పటికి పట్టణ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రచించిన దాఖలాలు లేవు. కొత్త పాలకవర్గానికి అధికారులకు కేవలం పరిచయ కార్యక్రమం చేపట్టి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కనీసం వార్డు పర్యటనలు కూడా చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తాండవిస్తున్న సమస్యలు

మున్సిపల్ పరిధిలో 49 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు ఇచ్చిన హామీ మేరకు అక్కడ క్కడా బోర్లు వేసి నీటి సమస్యకు పరిష్కారం చూపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా పట్టణ ప్రజల గొంతెం డుతోంది. అనేక ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. మరో 15 రోజుల్లో ఎండ తీవ్రత పెరిగితే తాగు నీటికి ఇబ్బందులు తప్పవు. అలాగే పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతుంది. ఫలితంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. శానిటేషన్ సమస్య గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు.


### వాన పడితే అంతే..

ప్రస్తుతం అకాల వర్షాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. చిన్న వాన పడితే పట్టణంలోని పలు కాలనీలు జలమయం అవుతాయి. గతేడాది వర్ష బీభత్సానికి కామారెడ్డి పట్టణం కకావికలం అయిన విషయం తెలిసిందే. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లు, ఇళ్ళల్లోకి నీరు చేరుతోంది. పట్టణంలో వరద ముంపు నివారణకు వేసవిలోనే పనులు చేపట్టాలి. మరో మూడు నెలలు అయితే వర్షాలు ప్రారంభం అవుతాయి. కానీ పాలకవర్గం ఇంత వరకు సమావేశం కాకపోవడంతో మళ్లీ వానాకాలంలో తిప్పలు తప్పవని ప్రజలు అనుకుంటున్నారు.

### శ్మశానికి దారి ఏది

గతేడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని హౌసింగ్ బోర్డు శ్మశాన వాటిక దారి కోతకు గురైంది. ఇప్పటికి ఆ రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన సమస్యలపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు విషయంలో పాలకవర్గం దృష్టి పెట్టాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

### 28న బడ్జెట్ మీటింగ్



మున్సిపల్ పాలకవర్గం కొలువైన తర్వాత జనరల్ బాడీ మీటింగ్ పెట్టాల్సింది. అయితే ఎజెండా అంశాలు కౌన్సిలర్లకు అందించడానికి సరిపడా సమయం కుదరడం లేదు. అందుకే ముందుగా ఈ నెల 28న బడ్జెట్ మీటింగ్ పెడుతున్నాం. పట్టణంలో సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. పాలకవర్గ తీర్మానాలతో సమస్యలు తొంద రగా పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుంది. త్వరలోనే జనరల్ బాడీ మీటింగ్ నిర్వహిస్తాం. – **రాజేందర్ రెడ్డి, కమిషనర్**

## విపత్తు సహాయక చర్యలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మాక్‌డ్రిల్



**అక్షరటుడే, కామారెడ్డి:** వరదలు, అకాల వర్షాలతో వచ్చే విపత్తుల సమయంలో తీసుకునే సహాయక చర్యలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు బుధవారం కామారెడ్డి పెద్ద చెరువులో మాక్ డ్రిల్ చేపట్టాయి. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వరద పరిస్థితుల్లో రక్షణ చర్యలు, శాఖల మధ్య సమన్వయం, స్పందన సామర్థ్యాన్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా మాక్ డ్రిల్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. వరదలో చిక్కుకున్న బాధితులను రక్షించే విధానాలను ప్రదర్శిస్తూ రెస్క్యూ బోట్లు, లైఫ్ జాకెట్లు, తాళ్ల సహాయంతో రక్షణ వంటి పద్ధతులను చూపించాయన్నారు. ఈ మాక్ డ్రిల్ కార్యక్రమంలో 12 శాఖలు, 187 మంది సిబ్బంది పాల్గొన్నాయని తెలిపారు. విపత్తు సమయంలో సమన్వయం, తక్షణ స్పందన, ప్రజల అవగాహన అత్యంత కీలకమని పేర్కొన్నారు. మాక్ డ్రిల్ ద్వారా ప్రజల రక్షణపై అవగాహనప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఎలా సురక్షితంగా రక్షించాలో తెలియజేయడానికి మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. మాక్ డ్రిల్ ల ద్వారా ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడం ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. విపత్తు సంభవించినప్పుడు భయపడకుండా, సరైన చర్యలు తీసుకుంటే ప్రాణ నష్టం తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, డిప్యూటీ కమాండర్ డోల్ సింగ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్, ఆర్డీవో వీణ , తహశీల్దార్ హిమబిందు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పెట్రోల్ కొరతపై అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పెట్రోల్ కొరత లేదని, కొరత ఉందని అసత్య ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం నుంచి పెట్రోల్ కొరత ఉందని, బంకులు మూసివేస్తారని జరుగుతున్న ప్రచారంపై ఎస్పీ స్పందించారు. జిల్లాలో అన్ని పెట్రోల్ బంకులలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రజలు అనవసరంగా ఆందోళనకు గురై బంకుల వద్దకు చేరుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, సాధారణ పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతుందన్నారు. ప్రజలు అనవసర ప్రచారాన్ని నమ్మి వదంతులను షేర్ చేయవద్దని కోరారు.




## పెట్రోల్, డీజిల్ కొరత లేదు..: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా లో ప్రచారంలో ఉన్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతూ, ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించుకోవడం వల్ల అనవసర రద్దీ, అంతరాయం ఏర్పడుతోందన్నారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా కూడా నిరంతరంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని సీపీ సూచించారు. అలా చేయడం వల్ల ఇతరులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని, నిర్ధారించని సమాచారాన్ని షేర్ చేయడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని పోలీస్ కమీషనర్ విజ్ఞప్తి చేశా రు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు చేపడితే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్లలో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఎంత..? : ఎమ్మెల్యే



**అక్షరటుడే, కామారెడ్డి:** ఇందిరమ్మ ఇళ్లలో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఎంత అనేది చెప్పాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ సెషన్ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై తాను గత రెండు సెషన్లలో రెండు ప్రశ్నలు అడిగానని కేవీఆర్ అన్నారు. అందులో ఒక ప్రశ్నకు మాత్రమే సమాధానమిస్తూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వసతులు కల్పిస్తామన్నారని తెలిపారన్నారు. అయితే డబుల్ ఇళ్లు బీటలు వారాయని, అద్దాలు పగిలిపోయాయని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని వివరించారు. ఈ సమయంలో ఇంకా ఆలస్యం చేస్తే ప్రభుత్వానికే నష్టమన్నారు. ప్రస్తుతం ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో త్వరగా పనులు పూర్తి అర్హులైన వారికి కేటాయించాలని కోరారు. ప్రస్తుతం డబుల్ ఇళ్ల స్థానంలో 'ఇందిరమ్మ ఇళ్లు' కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో తెలిసిన వాళ్లని, అనుచరులు అని ఇష్టం వచ్చినట్టు ఇళ్లకు కేటాయించారని, ప్రస్తుతం అలా జరగకుండా చూడాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేస్తే తాను కమిటీల విషయంలో జోక్యం చేసుకోలేదన్నారు. కమిటీ నిర్ణయాల మేరకే పనులు జరుగుతున్నాయన్నారు. అయితే ప్రస్తుతం కొందరు తాము ఉన్న పొజిషన్ చెప్పుకుంటూ, అధికారంలో ఉన్నామని, తమకే ఇవ్వాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై సంబంధిత శాఖ మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చి వారికి మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలని వెంకటరమణా రెడ్డి కోరారు. గత సెషన్‌లో 'డబుల్' ఇళ్ల నిర్మాణాల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఎంత అని అడిగితే ఇప్పటికీ సమాధానం ఇవ్వలేదని చెప్పారు. దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు.

## నిజామాబాద్‌లో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదు: ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఒక్క లబ్ధిదారుడికి సైతం ఇవ్వలేదని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూంలపై మాట్లాడారు. ఇందూరులోని నాగారం ప్రాంతంలో 396 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి నాలుగున్నరేళ్లు గడిచిందని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకువచ్చారు. బీఆర్ఎస్ నాయకులు కమిషన్లు తీసుకున్నారు కానీ ఒక్క ఇల్లు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. ఏళ్లుగా వృథాగా ఉండడంతో ఇళ్ల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయని, పలు వస్తువులు చోరీకి గురయ్యాయని తెలిపారు. అనేకసార్లు మంత్రులకు విన్నపించడంతో మరమ్మతుల కోసం రూ.1.25 కోట్లు విడుదల చేశారని, కానీ ఇళ్లు మాత్రం కేటాయించలేదన్నారు. అనవసరంగా ప్రజాధనం వృథా అవుతుందని చెప్పారు. అలాగే కలెక్టరేట్ సమీపంలో 200 డబుల్ బెడ్ రూం ఇళ్లు 80 శాతం పూర్తి చేసుకున్నాయని, మరో రూ.2 కోట్లు మంజూరు చేస్తే పూర్తవుతాయన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలి: సుదర్శన్ రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఊతమందించే పాలిటెక్నిక్ కళాశాలను విద్యార్థులు, యువత పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి బుధవారం నవీపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. యువతకు తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలనే తపనతో జిల్లాలో విరివిగా పాలిటెక్నిక్ కాలేజీ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే విద్యార్థులు తగిన విధంగా ప్రవేశాలు పొందడం లేదని, ఈ కళాశాల గురించి విస్తృత స్థాయిలో అవగాహన పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. గడిచిన నాలుగేళ్లలో పాలిటెక్నిక్ కోర్సులు చేసిన అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తు చేశారు. ప్రస్తుతం నవీపేట కళాశాల లో సివిల్, మెకానికల్ విభాగాలు కొనసాగుతున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నుండి రోబోటిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు సైతం అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువత వినియోగించుకోవాలని హితవు పలికారు. ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులను సన్నద్ధం చేశామని ప్రభుత్వ సలహాదారు అన్నారు. ప్రజలు కూడా సకాలంలో మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు పన్నులు చెల్లిస్తూ సదుపాయాలను మెరుగుపర్చేందుకు సహకరించాలని కోరారు. ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నామని, కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై నిఘా ఉంచాలని సంబంధిత శాఖలకు సూచించామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు వెంట ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, సందీప్ తదితరులున్నారు.




## అరెస్ట్‌లతో లంబాడీల ఉద్యమాన్ని ఆపలేరు..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అరెస్ట్‌లతో లంబాడీల ఉద్యమాన్ని ఆపలేరని ఆల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ అన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై సేవాలాల్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనే డిమాండ్ లంబాడీలు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టారు. హైదరాబాద్ తరలుతున్న లంబాడీలను ఇందల్వాయి టోల్ గేట్ వద్ద పోలీసులు లంబాడీలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో.. ఆల్ ఇండియా బంజారా సంఘం జిల్లా ప్రతినిధులు రవి, కె.రాకేష్, చక్రు ఉన్నారు.

**ఎల్లారెడ్డి పట్టణంలో..**

**ఎల్లారెడ్డి:** పట్టణంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పలువురు లంబాడీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో లంబాడీ ఐక్యవేదిక యూత్ ఇన్‌ఛార్జి కామారెడ్డి జిల్లా అనిల్ నాయక్ ,లింబేస్ నాయక్, నరేష్‌నాయక్ ఉన్నారు.

## ముప్కాల్‌లో యూకేజీ తరగతుల ప్రారంభం



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ ప్రీ ప్రైమరీ పాఠశాలలో యూకేజీ తరగతులను ప్రారంభించారు. చిన్నారులకు ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ తరగతులను ప్రారంభించినట్లు సర్పంచ్ కొమ్ముల సాయమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బ్రమ్మదండి చిన్నయ్య, మండల విద్యాధికారి ఎం.గంగారం, వార్డు సభ్యుడు నవీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయానంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువకుడి చికిత్స కోసం ఆర్థికసాయం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన డప్పు గంగాధర్ 12రోజుల క్రితం ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి భార్య, కూతురు ఉన్నారు. అయితే వారి కుటుంబం ఆర్థికంగా బాగా లేకపోవడంతో సర్పంచ్ భాస్కర్, యువకులు ఈశ్వర్, అతని క్లాస్‌మేట్ విశ్వనాథ్ కలిసి డాక్టర్ సితలే రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన వాట్సాప్ స్టేటస్ ద్వారా రూ.25,500 డబ్బులు జమచేసి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు వెళ్లి బాధితుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, జంగం శివ కుమార్, గోపాల్, బజరంగ్, ఈశ్వర్, సందీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ బల్దియలో శ్రమ దోపిడీ జరుగుతోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలలుగా తమకు సక్రమంగా జీతాలు ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ధర్నా నిర్వహించారు. పీఎఫ్ ఈఎస్ఐ, ఏరియర్స్, ఎన్నికల విధుల డబ్బుల చెల్లింపులు అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కార్మికులు ఆందోళన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

– అక్షరటుడే,ఆర్మూర్




# మున్సిపల్ కార్మికుల
# శ్రమ దోపిడీ

- జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో అలసత్వం
- ఆందోళన దిగిన కార్మికులు
- మద్దతు తెలిపిన కార్మిక సంఘాలు..

**చూస్తూ ఊరుకోం..**

మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు పాలకవర్గ సభ్యులు ఇష్టారీతిన వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోం. మూడు నెలలకోసారి జీతాలు ఇస్తే కార్మికులు ఎలా బతకాలి. ముఖ్యంగా మహిళా కార్మికులు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నూతన పాలకవర్గం, కమిషనర్ చొరవ చూపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తాం.

– ఇందారపు రాజు, ఎమ్మార్పీఎస్ నాయకుడు

ఆర్మూర్ మున్సిపాలిటీలో సుమారు 232 మంది సిబ్బంది పనిచేస్తుండగా అందులో పారిశుధ్య తదితర కార్యక్రమాల్లో 170 కార్మికుల విధులు నిర్వహిస్తున్నారు. తమకు రావాల్సిన జీతాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రతినెలా కార్మికులకు రెండు రోజులు సెలవు ఇవ్వాలని తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన చేపట్టారు.

**పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర**

పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే కార్మికులు ఆందోళన దిగడం ప్రస్తుతం ఆర్మూర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వార్డుల్లోని కాలనీల్లో మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేస్తూ చెత్తను సేకరిస్తూ కార్మికులు స్వచ్ఛతను చాటుతున్నారు.

**పాలకవర్గ తీరుపై ఆగ్రహం...**

ఇటీవల గెలిచిన పాలకవర్గ సభ్యులు తమపై పెత్తనం చెలాయించడంపై మున్సిపల్ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మాణాలు చేపట్టవద్దు



**అక్షరటుడే, లింగంపేట :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని బుధవారం ఆర్డీవో ప్రభాకర్‌కు లింగంపేట ప్రజలు, యువకులు, ఆయా రాజకీయ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఖాళీస్థలంలో యువకులకు క్రీడా మైదానంగా ఉపయోగపడుతోందన్నారు. అలాగే రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టినందుకు ఆ స్థలాన్ని వినియోగిస్తున్నారన్నారు. అలాంటి స్థలాన్ని ఇతర నిర్మాణాలకు కేటాయించవద్దని తీర్మానించుకున్నామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, సర్పంచ్ కౌడ రవి, ఉప సర్పంచ్ ప్రసాద్ గౌడ్, ముదాం సాయిలు, శేపూరి పోశెట్టి, బొల్లారం క్రాంతి కుమార్, రఫీయుద్దీన్, అప్రోచ్, గుండా బాలకిషన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సహజ వ్యవసాయం ప్రాముఖ్యతపై అవగాహన



**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ మండలంలోని నాళేశ్వర్‌లో బుధవారం సహజ వ్యవసాయం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత జీవన విధానంలో రైతుల ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు భూమి సారాన్ని కాపాడుకోవడానికి సహజ వ్యవసాయం ఎంతో కీలకమని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఎన్ఎఫ్ కింద పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. అదేవిధంగా జూట్ బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు, క్యాలెండర్లు, క్యాప్స్ వంటి ఉపకరణాలను కూడా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్మూర్ లావణ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు, ప్యాక్స్ మాజీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు, మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి వసంత్, రిసోర్స్ పర్సన్ రవీందర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, యువ రైతులు చిన్నదోడ్డి ప్రవీణ్, గణేష్, సంజీవ్, సంపత్, పోతన్న, కిషన్, లింగారెడ్డి, శ్రీకాంత్, నవీన్, పోతన్న, రాజు, ప్రవీణ్, దశరథ్, బోజారం రైతులు పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేష్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి అభివృద్ధి జాజాల సురేందర్‌తోనే సాధ్యమైందన్నారు. ఆయన చేసిన పనులు ఇప్పటికీ కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల క్షేమం కోసం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు జాజాల సురేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, కమ్మరి సిద్ధిరాములు, గాండ్ల నర్సింలు, యూసుఫ్, దాసరి పర్వయ్య, పరంధాములు, యాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- అక్షరటుడే, లింగంపేట




## వైద్య శిబిరం ఏర్పాటు



**అక్షరటుడే,కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆరు గురు వైద్య నిపుణులు రోగులకు అన్ని రకాల వైద్యచికిత్సలు అందజేశారు. శిబిరానికి పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మాండ్లు, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## మతం మారిన ఎస్సీలకు ఆ హోదా రద్దుపై వీహెచ్‌పీ హర్షం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** క్రైస్తవంలోకి మారిన ఎస్సీలకు ఆ హోదాను సుప్రీంకోర్టు రద్దు చేయడంపై వీహెచ్‌పీ నాయకుడు వినోద్ కుమార్ హర్షం చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తాజా తీర్పు హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. క్రైస్తవ మతంలోకి మారిన ఎస్సీలు తమ ఎస్సీ హక్కులను కోల్పోవాల్సి ఉంటుందని తాజా ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయన్నారు. తహశీల్దార్ ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఎస్సీ హోదా కొనసాగదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎస్సీ రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతున్న క్రైస్తవులు తమ పదవులు, ఉద్యోగాలకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు సుప్రీంకోర్టు తీర్పును కచ్చితంగా అమలు చేయాలన్నారు. లేదంటే వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. నవీన్, తులసీదాస్, రాహుల్, హర్ష, పురుషోత్తం, విద్యాసాగర్, విష్ణు ఉనారు.

## నందిపేట్ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్:** టీజీఎస్ఆర్టీసీ మెరుగైన సేవల్లో భాగంగా నందిపేట్ నుంచి సూపర్‌లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్నట్లు నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్ పేర్కొన్నారు. సర్పంచ్ లింగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ ఆనంద్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నుంచి నందిపేట్‌కు ప్రస్తుతం 19 సర్వీసులు నడుస్తున్నాయన్నారు. అలాగే నందిపేట్ మండల పరిధిలో మరో 12 బస్సులు నడుస్తున్నట్లు తెలిపారు. 22 గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు నందిపేట్ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు సేవను ప్రారంభించినట్లు వెల్లడించారు. నందిపేట్ సర్పంచ్ ఎర్ర లింగం మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందిస్తున్న ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా నందిపేట్ ప్రాంతానికి పెంచిన బస్సు సర్వీసులు, హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అదేవిధంగా క్యాష్‌లెస్ (నగదురహిత) విధానాన్ని కూడా ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.




## కొత్తపల్లిలో ముందస్తు బడిబాట ప్రారంభం

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని కొత్తపల్లిలో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బర్కుంట గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడేళ్లు పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే మంచి విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంద న్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేశ్వర్, శివ, ప్రధానోపాధ్యాయులు అనికేశి రఘు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సాయిలు, ధనుంజయ్, సుజాత, ప్రీప్రైమరీ ఉపాధ్యాయులు స్వప్న, రాజశ్రీ పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


**అక్షరటుడే,కోటగిరి:** పోతంగల్ మండలంలోని పోతంగల్ జీపీ పరిధిలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీవో చందర్ బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో పిల్లల హాజరును పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేవిధంగా చూడాలని, రాని పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాలింతలు, గర్భవతులు కేంద్రానికి వచ్చి ఆహారం తీసుకోవాలని తెలిపారు.

## ఇస్రో సందర్శనకు విద్యార్థుల ఎంపిక




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థి సిర్నపల్లి విష్ణు వర్ధన్, 8వ తరగతి విద్యార్థి ఈర్ల రాహుల్ విజేతలకు నిలిచారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇరువురు బుధ, గురువారాల్లో శ్రీహరికోటలోని ఇస్రో వెళ్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం నంది సుశీల్ కుమార్, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్, ఉప సర్పంచ్, వీడీసీ సభ్యులు అభినందించారు.

## జీపీ భవనానికి భూమిపూజ



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నాగంపేట్ గ్రామంలో నూతన పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.20 లక్షలు మంజూరవడంతో సర్పంచ్ దాసరి గంగాధర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి భవనం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా.. 19మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించారు. అందులో అతిగా మద్యం సేవించిన ముగ్గురికి వారంరోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ హైమద్ మెయిద్దీన్ తీర్పునిచ్చారు. అలాగే మరో 16 మందికి ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పు న జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.